క్లుప్తంగా

వాటర్ ప్లాంట్‌ను పరిశీలించిన ఉద్యోగులు



ప్లాంట్‌లో పరిశీలిస్తున్న ఏఈఈ, కార్యదర్శి

సాక్షి ఎఫెక్ట్..

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లిలో వాటర్ ప్లాంట్లను మిషన్ భగీరథ ఇంట్రా ఏఈఈ సతీష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. గ్రామంలోని వాటర్ ప్లాంట్‌ను మూసివేసిన అంశంపై 'తాగునీటి తంటాలు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో డీపీఓ హరికిషన్ ఆదేశాల మేరకు ఏఈఈ సతీష్‌కుమార్, కార్యదర్శి నెహ్రూ ప్లాంట్‌ను పరిశీలించి మరమ్మతులపై దృష్టి సారించారు. రెండు రోజుల్లోగా పనులు పూర్తిచేసి ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకువస్తామని వారు తెలిపారు.

ప్రచార సభను విజయవంతం చేయాలి

కూసుమంచి: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి ప్రచార సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి కోరారు. కూసుమంచిలోని మంత్రి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగాసభకు కార్యకర్తలను అధిక సంఖ్యలో తరలించాలని సూచించారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

కామేపల్లి: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఎంపీపీ బానోత్ సునీత అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ఎంపీటీసీలు హాజరయ్యారు. అయితే, కోడ్ అమల్లో ఉండడంతో ఎలాంటి చర్చ లేకుండానే సమావేశాన్ని ముగించారు.

ఖమ్మం చిన్నారుల నృత్యప్రదర్శన



జ్ఞాపికలతో మీనా, విద్యార్థులు

ఖమ్మంగాంధీచౌక్: అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని సోమవారం రాత్రి తెలంగాణ సారస్వత కళా పరిషత్ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంకు చెందిన ఏలూరి మీనాతో పాటు మీనా నాట్యాలయం విద్యార్థులు పాల్గొని నృత్యప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా మీనా స్వర్ణనంది అవార్డు గెలుచుకోగా, మిగతా విద్యార్థులు సన్మానం అందుకున్నారు.

మాలల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో నివాసముంటున్న వైరా మండలం వల్లాపురానికి చెందిన మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. నగరంలో చెరుకూరి మామిడి తోటలో జరిగిన ఈ సమ్మేళనంలో పలువురు మాట్లాడుతూ ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలవడం ఆనందంగా ఉందని తెలిపారు. అంతా ఐక్యంగా ఉంటూ పరస్పర సహకారం అందించుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో చింతమాల రాములు, సుందర్‌రావు, సీహెచ్.రవికుమార్, గొర్రెముచ్చు లాజరు, మద్ది వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెట్టు కొమ్మ పడడంతో గాయాలు

నేలకొండపల్లి: మండలంలోని ఆరెగూడెంకు చెందిన లింగరాజు సోమవారం ఓ రైతుకు చెందిన చెట్టును నరుకుతుండగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో చెట్టు కొమ్మ లింగరాజుపై పడడంతో ఆయన కాలు విరిగింది. దీంతో స్థానికులు ఆయనను ఆస్పత్రికి తరలించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ది ఫ్యామిలీ స్టార్, రాడీ బోయ్స్
వినోద	(టిల్లు) స్క్వేర్
సాయిరాం	రత్నం
ఆదిత్య(కేపీఎస్)	గీతాంజలి మళ్లీ వచ్చింది
శ్రీనివాస	మంజుమ్మల్ బాయ్స్

- ఖమ్మంవ్యవసాయం



రఘునాథపాలెం - జింకల తండా మార్గంలో పూర్తయిన బీటీ రోడ్డు

డొంక మార్గంలో.. ధోకా లేకుండా!

రూ.2.50 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణం

- రఘునాథపాలెం - జింకల తండా మార్గంలో రహదారి
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు, రైతులు



రఘునాథపాలెం చెరువు అలుగు వద్ద జరుగుతున్న పనులు

రఘునాథపాలెం: ఇప్పటివరకు రెండువైపులా కంప చెట్లు.. మోకాలి లోతు గుంతలతో ఇరుకుగా ఉండి కేవలం కాలిబాటగా, ఎడ్లబండ్లు మాత్రమే రాకపోకలు సాగించేలా అనువుగా ఉన్న రోడ్డు అది. కానీ ఆ ఇరుకు డొంక రోడ్డు కాస్త గ్రామీణ లింక్‌రోడ్ల నిర్మాణంలో భాగంగా రూ.2.50కోట్లతో విశాలమైన తారు రోడ్డుగా రూపుదిద్దుకుంది. మండల కేంద్రమైన రఘునాథపాలెం నుండి జింకల తండా ప్రధాన మార్గాన్ని కలిపే డొంక రోడ్డు నిర్మాణం ఇటీవలే పూర్తయింది. ఈ రహదారిలో రఘునాథపాలెం చెరువుకట్టకు ఆనుకుని ఉన్న అలుగు వాగుపై పనులు కొనసాగుతున్నాయి. ఇది కూడా పూర్తయితే ఏటా వానాకాలంలో రైతులు పడుతున్న ఇబ్బందులు, వాహనదారుల ఇక్కట్లు తీరనున్నాయి.

ఏళ్లుగా ప్రతిపాదనలు

రఘునాథపాలెం నుంచి జింకల తండా డొంక రోడ్డు అభివృద్ధి పనులు ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. రెండేళ్ల క్రితం నిధులు మంజూరైనా పనులు మొదలు కాలేదు. రెండు నెలలు క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకుని అధికారులను ఆదేశించడంతో చకచకా నిర్మాణం పూర్తయింది. కాగా, డొంక రోడ్డు 30 అడుగులుగా ఉండగా, దీన్ని 40 అడుగులకు విస్తరిస్తే బాగుటుందని స్థానిక ప్రజాప్రతినిధులు భావించారు. ఈమేరకు స్థానిక రైతులను ఒప్పించి అటూ, ఇటు ఐదు అడుగులు చొప్పున భూమి సేకరించి నిర్మాణం చేపట్టారు.

రోడ్డు నిర్మాణంతో ఉపయోగం



ఈ రోడ్డు నిర్మాణం వల్ల రైతులతో పాటు గ్రామస్తులకు ఉపయోగంగా ఉంటుంది. రోడ్డు సువిస్తరించేందుకు రైతులను ఒప్పించడానికి అనేక ప్రయత్నాలు చేశాం. రైతులు సానుకూలంగా స్పందించడంతోనే 40 అడుగులుగా విస్తరించడం సాధ్యమైంది. ఇందుకు చొరవ తీసుకున్న ప్రజాప్రతినిధులకు రుణపడి ఉంటాం.

– తాతా రఘురాం, రఘునాథపాలెం సొసైటీ అధ్యక్షుడు

రైతులకు మేలు జరిగినట్లే...



డొంకరోడ్డును తారురోడ్డుగా తీర్చిదిద్దడంతో రైతులకు మేలు జరుగుతుంది. పొలాలకు వెళ్లాలంటే వానాకాలంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇప్పుడు మంచి రోడ్డు అందుబాటులోకి రావడంతో అర్ధరాత్రి అయినా, వాన వచ్చినా ధైర్యంగా వెళ్లిరావొచ్చు. ఇందుకు కృషిచేసిన అధికారులు, పాలకులకు కృతజ్ఞతలు.

– అల్లిక రామకృష్ణ, రఘునాథపాలెం

తగ్గిన దూరాభారం

డొంకరోడ్డును తారు రోడ్డుగా మార్చడంతో రాకపోకలు సాగించే వారికి దూరాభారం తగ్గనుంది. గతంలో జింకలతండా, పరికలబోడు, మల్లేపల్లి తదితర గ్రామాల వాసులు రఘునాథపాలెంకు రాకపోకలు సాగించాలంటే చుట్టూ తిరిగి ఇల్లెందు ప్రధాన రోడ్డులో వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు రహదారి పూర్తికావడంతో సుమారు మూడు కిలోమీటర్ల దూరం తగ్గి సమయం కలిసొస్తుంది.

నేటితో ముగియనున్న 'ఎర్లీ బర్డ్'

- 5 శాతం రాయితీతో ఆస్తిపన్ను చెల్లింపునకు అవకాశం
- కేఎంసీకి ఇప్పటి వరకు రూ.7.80 కోట్ల ఆదాయం



పన్ను వసూళ్లను పర్యవేక్షిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: నగర, పుర పాలక సంస్థల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభం నెల ఏప్రిల్‌లో ఎర్లీ బర్డ్ స్కీంను అమలు చేస్తుంది. ఇందులో భాగంగా ఏప్రిల్‌లో రాయితీతో ఆస్తి పన్ను చెల్లించేందుకు ఎర్లీ బర్డ్ స్కీం ప్రవేశపెట్టారు. ఈ నెలలో పన్ను చెల్లించే వారికి ఈ స్కీం ద్వారా ఐదు శాతం రాయితీ లభిస్తుంది. కాగా, రాయితీతో పన్ను చెల్లించే గడువు మంగళవారం ముగియనుంది. దీంతో వీలైనంత మేరకు పన్నులు వసూలు చేసేలా మున్సిపల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పెద్ద మొత్తంలో పన్నులు చెల్లించే వారి నుండి ఇప్పటికే 25 శాతం మేర పన్నులు చేశారు. ఈ మేరకు కేఎంసీ పరిధిలో ఇప్పటి వరకు 12,810 అసెస్‌మెంట్ల ద్వారా రూ.7.80 కోట్లు ఆస్తి పన్ను వసూలైందని అధికారులు తెలిపారు. చివరిరోజు కూడా పలువురు యజమానులను కలిసి ఎక్కువ మొత్తంలో పన్నులు రాబట్టేలా ఉద్యోగులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు.

మే డేను విజయవంతం చేద్దాం..



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరావు

ఖమ్మంవ్యవసాయం: మే డే విజయవంతానికి వివిధ విభాగాలకు చెందిన కార్మికులు సన్నద్ధం కావాలని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్మిక విభాగం నాయకుడు నున్నా మాధవరావు పిలుపునిచ్చారు. కార్మిక విభాగం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది 2వేల మంది కార్మికులతో మే డే నిర్వహించనుండగా, ఖమ్మం మార్కెట్ మెయిన్ గేట్ నుంచి మొదలయ్యే ప్రదర్శన యార్డుల గుండా ఐఎన్‌టీయూసీ కార్యాలయానికి చేరుతుందని తెలిపారు. అనంతరం పెద్ద సంఖ్యలో కార్మికులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షాన ఐఎన్‌టీయూసీలో చేరతారని చెప్పారు. ఈమేరకు ట్రాలీ వర్కర్లు, హమాలీలు, స్వీపర్లు, రెల్లుడు కార్మికులు, దాల్ మిల్ కార్మికులు, నైట్ వాచ్‌మెన్లతో పాటు అన్ని విభాగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని మాధవరావు కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఆవుల శ్రీనివాసరావు, సాద శంకర్, కొత్త సైదిరెడ్డి, ఎర్రం రాంరెడ్డి, ఎస్.కే.పాషా, వడ్డే వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే యాదవులు, కుర్మలకు గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న మల్లిబాబు

నేలకొండపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే యాదవులు, కురుమలకు గుర్తింపు లభించిందని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ తెలిపారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత యాదవులు, కురుమలపై ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో 2006లో ఫెడరేషన్ ఏర్పాటు చేస్తే.. గత ప్రభుత్వ హయాంలో మాత్రం గొర్రెల పంపిణీలో అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. ఈ సమావేశంలో మల్లెబోయిన శ్రీనివాసరావు, సీతారాములు, మార్తి కోటి, వెంకటేష్, రవి, శేఖర్, చిలకల భూషయ్య, లిక్కి హన్మంతతరావు, మేకల శ్రీను, మన్నె కోటేశ్వరరావు, యర్రబోయిన నర్సయ్య, నవీన్, బాలిన శ్రీశైలం, మెట్టేల నాగేశ్వరరావు, ఎర్రయ్య, నరేష్, నగేష్, పరిటాల వలరాజు పాల్గొన్నారు.

శుభకార్యాల్లో ప్రజాప్రతినిధులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని గీతాంజలి విద్యానికేతన్ అధినేత టీ.వీ.అప్పారావు - పద్మ కుమారుడు అఖిల్-ప్రణతి వివాహ రిసెప్షన్ ఆదివారం రాత్రి జరగగా పలువురు హాజరై ఆశీర్వదించారు. బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి నామ నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మదన్‌లాల్, వివిధ పార్టీల నాయకులు నున్నా నాగేశ్వరరావు, పోతినేని సుదర్శన్, భాగం హేమంతరావు, పోటు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, పలుచోట్ల జరిగిన శుభకార్యాలకు సైతం ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

ఏబీవీపీ నేతల దాడి గర్హనీయం

ఖమ్మంమయూరిసెంటర్: వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యాన జరిగిన లౌకిక శక్తుల, రచయితల సమావేశంపై ఏబీవీపీకి చెందిన నాయకులు దాడి చేయడం గర్హనీయమని, దీనిని ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఖండించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు ఆవుల అశోక్, టి.ఝాన్సీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనేక భావజాలాలపై చర్చించే ప్రజాస్వామిక వాదులపై దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. భిన్న భావజాలంపై స్వేచ్ఛాయుతమైన చర్చలను ఆహ్వానించాలే తప్ప దాడులు చేయడం సరికాదని తెలిపారు. కాగా, ఈ దాడిని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వి.వెంకటేష్ మరో ప్రకటనలో ఖండించారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

నేలకొండపల్లి: చెక్‌పోస్ట్ మీదుగా ప్రతీ వాహనాన్ని నిశితంగా తనిఖీ చేయాలని పాలేరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాజేశ్వరి ఉద్యోగులకు సూచించారు. మండలంలోని పైనంపల్లి వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును సోమవారం ఆమె పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్నందున చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు విస్తృతంగా చేపట్టాలని, తద్వారా డబ్బు, మద్యం రవాణాను అరికట్టాలని తెలిపారు. ఆతర్వాత పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆమె వసతుల కల్పన, పోల్ స్లిప్పుల పంపిణీపై సూచనలు చేశారు. ఇరిగేషన్ ఏఈ నరేష్ పాల్గొన్నారు.

చికిత్స కోసం ఆర్థికసాయం

కామేపల్లి: కామేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కామ రాంబాబు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన చికిత్స కోసం బానోత్ మంగమ్మ రూ.5 వేల ఆర్థికసాయం ప్రకటించగా, ఉపాధ్యాయుడు అంగోత్ రమేష్ సోమవారం అందజేశారు. ఈకార్యక్రమంలో మోసం యుగేందర్, పెరసాని సందీప్, శివకృష్ణ, సరస్వతి, నాగమణి, షాకీర్, విక్రమ్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

కూసుమంచి: మండలంలోని గైగోళ్లపల్లి మాజీ సర్పంచ్, సీపీఐ సీనియర్ నాయకుడు సంగబత్తుల వెంకటరెడ్డి మృతిపై పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంతాపం తెలిపారు. సోమవారం జరిగిన ఆయన అంత్యక్రియల్లో కూనంనేని తదితరులు పాల్గొని నివాళులర్పించడంతో పాటు వెంకటరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు భాగం హేమంతరావు, పోటు ప్రసాద్, మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యపై కేసు నమోదు

కూసుమంచి: మండలంలోని పాలేరుకు చెందిన వివాహిత నూకల తేజస్విని(26) ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలు తేజస్విని మానసికంగా ఇబ్బంది పడుతూ డిప్రెషన్‌లోకి వెళ్లడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖమ్మం - ఇల్లెందు ప్రధాన రోడ్డు కైకొండాయిగూడెం క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు. ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న ముదిగొండ మండలం చిరుమర్రికి చెందిన లాలయ్య ఈనెల 21న కంపెనీ పనిపై వెళ్తుండగా జంక్షన్‌లో వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన లాలయ్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కేసీఆర్‌కు ఘనస్వాగతం

- హారతులు ఇచ్చి.. దిష్టితీసిన మహిళలు
- డప్పు వాయిద్యాలు, టపాసులతో స్వాగతం పలికిన శ్రేణులు



కేసీఆర్ బస్సుయాత్ర స్వాగత ర్యాలీలో గిరిజన మహిళల సంప్రదాయ నృత్యం



కేసీఆర్‌కు హారతి ఇస్తున్న మేయర్, మహిళలు

ఖమ్మంమయూరిసెంటర్/తిరుమలాయపాలెం: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర సోమవారం సాయంత్రం ఖమ్మంలో కొనసాగింది. ఖమ్మంలోని ఖమ్మంరూరల్ మండలం నాయుడుపేట, కాల్వొడ్డు మీదుగా ఖమ్మం మయూరిసెంటర్‌కు చేరుకున్న కేసీఆర్‌కు జిల్లా నేతలు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మహిళా నేతలు కేసీఆర్‌కు హారతులు ఇచ్చి గుమ్మడికాయలతో దిష్టి తీశారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, లంబాడి నృత్యాలతో పాటు టపాసుల మోతల మధ్య బస్సుయాత్ర సాగింది. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, మెచ్చా నాగేశ్వరరావు, బానోత్ మదన్‌లాల్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మేయర్ పునుకొల్లు నీరజ, గుండాల కృష్ణ స్వాగతం పలికారు. మయూరిసెంటర్ నుండి పాతబస్టాండ్, వైరారోడ్డు మీదుగా జెడ్పీసెంటర్ వరకు కేసీఆర్ బస్సు యాత్ర కొనసాగగా.. జెడ్పీసెంటర్‌లో కార్నర్ మీటింగ్‌కు జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కేసీఆర్ ఉపన్యాసానికి కేరింతలు కొట్టారు. తొలుత కేసీఆర్ కాన్వాయ్ జిల్లా సరిహద్దు తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం వద్దకుచేరుకోగా నాయకులు ఎదురెళ్లి స్వాగతం పలికారు. అయితే, సమయం తక్కువగా ఉండటంతో కేసీఆర్ తన వాహనం చూపి నమస్కరిస్తూ ముందుకు సాగారు. కాగా, కేసీఆర్ కాన్వాయ్‌ను మాదిరిపురం చెక్‌పోస్టు వద్ద పోలీసు అధికారులు తనిఖీ చేశారు. కాన్వాయ్‌లో భారీ సంఖ్యలో వాహనాలు ఉండడంతో రెండు కార్లను తనిఖీ చేయగా.. కేసీఆర్ ప్రయాణిస్తున్న బస్సులోకి మాత్రం పోలీసులు వెళ్లలేదు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

గంట 13 నిమిషాలు యాత్ర

కేసీఆర్ బస్సుయాత్ర ఖమ్మంలో గంట 13 నిమిషాల పాటు కొనసాగింది. రాత్రి 7.40 గంటలకు ఖమ్మం మయూరిసెంటర్‌కు కేసీఆర్ చేరుకోగా అక్కడ నుండి జెడ్పీసెంటర్‌కు 8.22 గంటలకు చేరుకుంది. 8.30 గంటలకు కేసీఆర్ తన ప్రసంగాన్ని ప్రారంభించి 8.53 గంటలకు ముగించారు. ఈసందర్భంగా కాంగ్రెస్, బీజేపీపై విమర్శలు చేస్తూ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావును గెలిపించాలని కోరారు.

భారీ బందోబస్తు

ఖమ్మంక్రైం: మాజీ సీఎం కేసీఆర్ సోమవారం రాత్రి ఖమ్మంలో నిర్వహించిన రోడ్డు షోలో పాల్గొనగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రోడ్ షో సాగిన అన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. కేసీఆర్ ప్రయాణిస్తున్న బస్సు చుట్టూ రోప్ పార్టీని ఏర్పాటుచేశారు. అలాగే, మయూరి సెంటర్ బ్రిడ్జి పైనుంచి వాహనాల రాకపోకలను నిలిపివేసి బైపాస్ రోడ్డు మీదుగా మళ్లించగా.. మయూరిసెంటర్ నుండి జెడ్పీసెంటర్ వరకు వైరా రోడ్డు వైపు వాహనాలు రాకుండా గల్లీల వద్ద గస్తీ కాశారు.



కాన్వాయ్‌లో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

బీఆర్ఎస్ పార్టీకి షాక్...

కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు కార్పొరేటర్లు



కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లతో మంత్రి తుమ్మల, నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి బీఆర్ఎస్ పార్టీ అధినేత ఖమ్మం వచ్చిన రోజే ఆ పార్టీకి షాక్ తగిలింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 38, 56వ డివిజన్ల కార్పొరేటర్లు ఆలియా షౌకత్ అలీ, పైడిపల్లి రోహిణి సత్యనారాయణ సోమవారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. వీరికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, నాయకులు, ప్రజాప్రతినిధులు రాయల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, సాధు రమేష్‌రెడ్డి, మిక్కిలినేని నరేందర్, కమర్తపు మురళి, ఎండీ.ముస్తఫా, చోటేబాబా, రషీద్, పాలెపు వెంకటరమణ, ఖాదర్‌బాబా, హుస్సేన్, ఆశ్రిఫ్ తదితరులు పాల్గొన్నారు.

మీ బిడ్డను ఆశీర్వదించండి

ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి నామ



నామకు స్వాగతం పలుకుతున్న వ్యాపారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఇక్కడే పుట్టి.. ఇక్కడే పెరిగిన జిల్లా బిడ్డనైన తనకు లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు కోరారు. ఖమ్మం కూరగాయల మార్కెట్‌లో సోమవారం ఉదయం ఆయ న ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీలకతీతంగా పనులు చేయడమే కాక జిల్లా అభివృద్ధికి నిధులు తనను మరోమారు గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రెండు సార్లు పార్లమెంట్‌కు పంపిస్తే జిల్లా వాసుల గొంతునై కేంద్రంతో కొట్లాడి నిధులు తీసుకొచ్చానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, తోట రామారావు, మోరంపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

'రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్'



మాట్లాడుతున్న రాంబాబు, పక్కన శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీని మోసం చేయడమే కాక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్ అభ్యర్థులకు లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయొద్దని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ కోరారు. కాంగ్రెస్ నాయకుడు కోటా రాంబాబుతో కలిసి సోమవారం ఆయన ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌ధరలు విపరీతంగా పెంచి ప్రజలపై భారం మోపడమే కాక రిజర్వేషన్ల తొలగింపునకు కుట్ర పన్నిన బీజేపీకి గుణపాఠం చెప్పేలా కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. నాయకులు బొందయ్య, అంబేద్కర్, బాబురావు, వెంకట్, రవికుమార్, రమేష్, శ్రీను, కిరణ్, వీరస్వామి, గురువయ్య, వెంకన్న, కృష్ణ, జంగం వెంకయ్య, భద్రయ్య, రాజీవ్‌గాంధీ, మేకల రమేష్, రత్నబాబు, ముత్తయ్య పాల్గొన్నారు.

మాట తప్పిన బీజేపీని ఓడించాలి



అభ్యర్థి రఘురాంరెడ్డితో ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఇచ్చిన మాట తప్పిన బీజేపీని ఈ ఎన్నికల్లో మాదిగలు చిత్తుగా ఓడించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఖమ్మంలో సోమవారం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని కలిసి మద్దతు ప్రకటించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రఘురాంరెడ్డికి మాదిగలు అండగా ఉండి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకరరెడ్డితో పాటు ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు కె.శ్రీను, బూరుగడ్డ వెంకటేశ్వర్లు, శ్రీరాం, హరీశ్, హెచ్.వెంకటేశ్వర్లు, మేకల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.